క్లుప్తంగా

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోండి

శెట్టూరు: మండల కేంద్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులు రెన్యూవల్ చేసుకోవాలని మేనేజర్ లోకేష్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెన్యూవల్స్ తేదీలు ఆయా గ్రామాల్లోని బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్లు, మహిళా సంఘాల వద్ద, గ్రామ సచివాలయంలోను లిస్టులు ఉన్నాయన్నారు. రైతులు తప్పనిసరిగా రుణాలు రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

బూదగవిలో ఎన్ఎస్ఎస్ శిబిరం


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉరవకొండ: మండలంలోని బూదగవిలో మహాత్మ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఆదివారం ప్రారంభమైంది. శిబిరాన్ని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ధనుంజయ ప్రారంభించారు. ముందుగా విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ నెల 23వ తేదీ వరకు బూదగవి గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. ప్రిన్సిపాల్ బసవరాజు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కె.కె.ప్రసాద్, కరస్పాండెంట్ షాజహాన్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు సత్యనారాయణ, ఇషాక్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి విరాళం

కళ్యాణదుర్గం: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి రిటైర్డ్ తహసీల్దార్ డీవీ సుబ్రమణ్యం విరాళమిచ్చారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవనంలో ఆదివారం కార్యక్రమం నిర్వహించా. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి తనవంతుగా రూ.15,116లను రిటైర్డ్ తహసీల్దార్ అందజేశారు. సంఘం మౌళిక సదుపాయాల కల్పనకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివప్రసాద్, తిప్పేస్వామి, మారెన్న, నాగరాజు, సీసీ రెడ్డి, ఫక్రుద్దీన్, చెంగలయ్య, కృష్ణమూర్తి, కృష్ణంరాజు, నరసింహప్ప, హరికృష్ణ, రామన్న తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ల నారాయణరెడ్డి స్మారక టోర్నీ ప్రారంభం


బ్యాటింగ్ చేసి, టోర్నీ ప్రారంభిస్తున్న ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ(కూడేరు): కూడేరు మండలం ఇప్పేరు గ్రామంలో ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు దివగంత రాకెట్ల నారాయణరెడ్డి స్మారక మండలస్థాయి క్రికెట్ టోర్నీ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. టోర్నీని రాకెట్ల నారాయణరెడ్డి మనవడు, పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు క్రీడలు దోహదపడుతాయన్నారు. విన్నర్ జట్టుకు రూ.30 వేలు, రన్నర్ జట్టుకు రూ.20 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి నాయకులు తెలిపారు.

గ్యాస్ లీకేజీలపై అప్రమత్తంగా ఉండాలి

కళ్యాణదుర్గం/ఉరవకొండ/రాయదుర్గంటౌన్: గ్యాస్ లీకేజీలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని అగ్ని మాపక అధికారి నజీర్ అహ్మద్ సూచించారు. పట్టణంలోని మారెంపల్లితో పాటు పలు వీధుల్లో ఆదివారం గ్యాస్ లీకేజీ ప్రమాదాలపై సిబ్బందితో కలసి అవగాహన కల్పించారు. అలాగే ఉరవకొండ పట్టణం శివరామిరెడ్డి కాలనీలోని మహిళలకు అగ్నిమాపక శాఖ అధికారి భీమలింగయ్య ఆధ్వర్యంలో సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. రాయదుర్గంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ ఆదిశేషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం


అలంకరణలో వేంకటేశ్వరస్వామి

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహోత్సవాల సందర్భంగా శ్రీవారి కల్యాణం, సూర్యప్రభ వాహనం , హనుమత్ వాహనం ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , గ్రామ పెద్దలు, యువజన బ్రహోత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శిలగా మారిన 'కాలవ' ఫలకం!


బళ్లారి రోడ్డులో నాయీ బ్రహ్మణ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలం (ఫైల్)


ముత్రాస కాలనీ సమీపాన బైపాస్ రోడ్డు పక్కన షాదీమాహల్ శిలాఫలకం (ఫైల్)


మల్లాపురం లేఅవుట్ సమీపాన రజక భవనం కోసం ఏర్పాటు చేసిన ఫలకం (ఫైల్)


డి హీరేహాళ్ మండలం ఓబుళాపురం వద్ద గ్రామీణ నీటి పథకం కోసం ఇలా (ఫైల్)


కణేకల్లు మండలం నాగేపల్లి వద్ద మారుతి నగర వనం కోసం కాలవ శ్రీనివాసులు ఏర్పాటు చేసిన శిలాఫలకం (ఫైల్)

- కల్యాణ మంటపాల పేరుతో కుల సంఘాలకు టోకరా
- చిత్తు కాగితాలు చేతిలోపెట్టి మోసం చేసిన వైనం
- నేటికీ వెక్కిరిస్తున్న శిలా ఫలకాలు
- కాలవ తీరుపై కుల సంఘాల మండిపాటు

రాయదుర్గం: టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు టీడీపీ పాలన చివర్లో ఆడిన డ్రామా అట్టర్ ఫ్లాపైంది. మంత్రిగా ఉండే సమయాన దోపిడీకే పెద్దపీట వేస్తూ.. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకున్నాడు. ఈ విధానాలన్నింటిపై అప్పట్లో తన మానస పుత్రికగా చెప్పుకునే 'ఈనాడు'లోనే 'మంత్రి ఇలాఖాలో కంత్రీలా కులాసా' అంటూ పెద్ద అక్షరాలతో అచ్చేసిన ఘటన నేటికీ ప్రజల మదిలో మెదలుతూనే ఉంది. ఆ దృష్టి మరల్చి 2019 ఎన్నికల్లో ఎలాగైనా గట్టెక్కాలనే భావనతో కులాల వారీగా కల్యాణ మంటపాల నిర్మాణాన్ని తెరమీదికి తెచ్చాడు. ల్యాండ్ అవైలబుల్ సర్టిఫికెట్లు మాత్రమే ఇచ్చి ఆర్భాటంగా భూమిపూజ కార్యక్రమాలు కూడా చేపట్టాడు. తీరా చూస్తే వాటికి పైసా కూడా నిధులు మంజూరుకాకపోవడంతో నాలుగేళ్లైనా ఆ ఫలకాలన్నీ శిలగానే దర్శనమిస్తున్నాయి. వాటిని చూసిన ప్రతిసారీ ఆ కులసంఘం ప్రతినిధులు తీవ్రస్థాయిలో ఆక్రోశంతో ఊగిపోతున్నారు. లేని ఆశ కల్పించి ఓట్ల కోసం చిత్తుకాగితాలు తమ చేతిలో పెట్టి కాలవ మోసం చేశాడని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం ఆడిన ఈ సరికొత్త డ్రామాకు ఆయనకు ప్రజలు తగిన గుణపాఠమే చెప్పారు.

ఎన్నికల కోడ్‌కు గంట ముందు భారీ నీటి పథకానికి శంకుస్థాపన..

డి హీరేహాళ్ మండలం ఓబుళాపురంలో గ్రామీణనీటి విభాగం/ పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో రూ.191.13 కోట్ల భారీ వ్యయంతో నీటి పథకానికి శ్రీకారం చుట్టాడు. ఉదయం 11 గంటలకు శిలఫలకం వేసి ఆర్భాటంగా భూమిపూజ చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీనిపై కాలవ తీవ్ర విమర్శలపాలయ్యాడు. కోడ్ అమల్లోకి వస్తుందని తెలిసే ఓట్ల కోసం సరికొత్త నాటకానికి తెరతీశాడని స్థానికులతో పాటు అధికార పార్టీ నాయకులు నేటికీ దుమ్మెత్తి పోస్తున్నారు.

మారుతీ వనం అలాంటిదే..

కణేకల్లు మండలంలోని తుంబిగనూరు పంచాయతీ నాగేపల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద మారుతీ వనం పెంపకానికి ఫలకం వేశారు. రూ. లక్షలు ఖర్చుచేసినట్టు రికార్డుల్లో ఉన్నా వనం మాత్రం పెరగలేదని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. ఇలా అధికారం నాటి చిట్ట చివర్లో ఎన్నికల కోడ్ ముందు చేసిన పనులన్ని నేటికీ వెక్కిరింతగా నిలిచాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఉత్తుత్తి మాటలే

కాలవ శ్రీనివాసులు చేసిన మోసాలు నేటికీ ప్రజలు మరవడం లేదు. ఎన్నికల ముందు ఇలాంటి కుట్ర, కుతంత్రమైన రాజకీయాలకు ఒడిగట్టినా ప్రజలు నమ్మలేదు. టీడీపీ పాపలు, మోసాలు కడుక్కోవాలనే ఉద్దేశ్యంతో 2019 ఎన్నికల్లో చిత్తుగా ఓడించారు. పైసా నిధులు మంజూరు కాకపోయినా ఆర్భాటంగా శిలాఫలకాలు మాత్రం వేశాడు. తరచూ ఆయా కులసంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలవను 2024 ఎన్నికల్లోనూ ప్రజలు నమ్మే స్థితిలో లేరు. మంచిచేసే ప్రభుత్వం, హామీ ఇస్తే నెరవేర్చే నాయకుడి వెంటే ప్రజలంతా నడుస్తున్నారన్నారు.
– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్, రాయదుర్గం

కాలవ హయాంలో నెరవేరని హామీలు ఇలా..

- 2019, మార్చి 2న బళ్లారి రోడ్డులో రూ.10 లక్షల వ్యయంతో నాయీబ్రాహ్మణులకు కల్యాణ మంటపం నిర్మాణానికి భూమిపూజ చేశాడు.
- 2018, డిసెంబర్ 27న ముత్రాసు కాలనీ బైపాస్‌రోడ్డు పక్కన రూ.70 లక్షల వ్యయంతో షాదీమహల్ నిర్మాణానికి శిలాఫలకం వేశాడు.
- 2019, ఫిబ్రవరి 28న మల్లాపురం లేఅవుట్‌లో రూ.10 లక్షల వ్యయంతో రజక భవనం నిర్మాణానికి భూమిపూజ చేపట్టాడు.
- 2019 మార్చి లో బళ్లారి రోడ్డులో స్వకుళసాలి సమాజ కల్యాణ మంటపం కోసం భూమిపూజ చేశాడు.
- 09-03-2019 మార్చి 9న రూ.191.13 కోట్లతో డి హీరేహాళ్ మండలం ఓబుళాపురంలో తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశాడు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి ఉషశ్రీచరణ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను పంపిణీ చేశారు. తూముకుంటకు చెందిన యశోదకు రూ.38 వేలు, మానిరేవుకు చెందిన పద్మావతికి రూ.22 వేలు, కనుకూరుకు చెందిన జి.శివకు రూ.23 వేలు చొప్పున మొత్తం రూ.83 వేలు విలువ చేసే చెక్కులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీకి చరమగీతం పాడాలి'

రాయదుర్గంటౌన్: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని బీజేపీ సర్కారు కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున విమర్శించారు. బీజేపీ హటావో దేశ్‌కీ బచావో కార్యక్రమంలో భాగంగా సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మూడో రోజు ఆదివారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ పాలనలో దేశంలోని ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయన్నారు. బీజేపీకి ప్రజలు చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కొట్రేష్, నరసింహులు, నాగరాజు, తిప్పేస్వామి, ఏఐవైఎఫ్ నాయకులు కుమార్‌నాయక్, అనిల్, అంజి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కడదాం


దేవాదుల కొండ గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం/కంబదూరు/బ్రహ్మసముద్రం/వజ్రకరూరు: సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కడదామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దేవాదులకొండ గ్రామంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణితో కలిసి మంత్రి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక నాయకులు, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాల మధ్య తేడాను ప్రజలకు వివరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను ఇంటింటికీ అతికించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేసేందుకు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కిరీటి యాదవ్, సచివాలయ కన్వీనర్లు మంజు, లలితమ్మ, నారాయణ, శంకరప్ప, ఉమేష్, నారాయణస్వామిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

- కంబదూరు మండలంలోని గొల్లపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్లను ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు పంపిణీ చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధిని, చంద్రబాబు పాలనలో జరిగిన అన్యాయాన్ని వివరించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ బీమేష్, నాయకులు ఐపార్సుపల్లి వెంకటేశులు, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, సంజీవ్‌రెడ్డి, ఈరనాగన్న, మల్లేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.
- బ్రహ్మసముద్రం మండలంలోని పిల్లలపల్లి, ఎస్ కోనాపురం, గుండిగానిపల్లి, ఎర్రకొండాపురం తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీ సువర్ణమ్మ, సర్పంచ్ గోవిందప్ప, నాయకులు అశోక్ రెడ్డి, పాలబండ్ల చంద్రశేఖరరెడ్డి, విజయ్, అయ్యన్న, గోపాల్ తిమ్మరాయుడు , వెంకీ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.
- వజ్రకరూరు మండలంలోని తట్రకల్లు, ధర్మపురి, గడేహోతురు, చాబాల, వజ్రకరూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, వజ్రకరూరు పీఏసీఎస్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ భరత్‌రెడ్డి, మాజీ సర్పంచు వైద్యనాథరెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్ ఈశ్వరమ్మ, వజ్రకరూరు, గడేహోతురు, చాబాలు సర్పంచులు మోనాలిసా, కె.సురేంద్ర, , మల్లెల జగదీష్, సచివాలయ కన్వీనర్ పార్వతి, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప, సచివాలయ కన్వీనర్ రామచంద్ర, ఎంపీటీసీ పెన్నహోబిలం, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, నాయకులు వీరభద్రగౌడ్, సుధాకర్, హనుమంతనాయుడు, శ్రీనివాసులు, తిమ్మారెడ్డి, పరమేష్, రామలింగ, నాయకులు రాకెట్లబాబు, రఘుపతి, నల్లబోతులరాజు తదితరులు పాల్గొన్నారు.

'భాస్కర్‌రెడ్డి అరెస్టు బాధాకరం'

వజ్రకరూరు: వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్ట్ బాధాకరమని, ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం వజ్రకరూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో న్యాయబద్ధంగా సీబీఐ విచారణ జరగాలని కోరారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఆయన తనయుడు ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డికి మంచిపేరు ఉందన్నారు. వైఎస్.వివేకానందరెడ్డి హత్యకు వారికి ఎటువంటి సంబంధం లేకపోయినా, కొన్ని రాజకీయ, అరాచక శక్తులు , పచ్చ మీడియా చేస్తున్న ఆరోపణలను సీబీఐ పరిగణలోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు కనిపిస్తోందన్నారు. హత్య కేసులో అసలైన దోషులను గుర్తించేలా సీబీఐ విచారణ చేపట్టాలన్నారు.

సంక్షేమం, అభివృద్ధే జగనన్న అభిమతం

రాయదుర్గం రూరల్: సంక్షేమం, అభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని ఆవులదట్ల గ్రామంలో నియోజకవర్గ పరిశీలకుడు కుమార్ రాజా, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి, జెడ్పీటీసీ మల్లికార్జున, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి , మండల కోఆప్షన్ సభ్యుడు దిలావరుల్లాతో కలసి విప్ ఆదివారం గడప గడపకూమన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను తెలుసుకున్నారు. మోసపూరిత మాటలు చెప్పే కపటనాటక సూత్రధారి చంద్రబాబును నమ్మొద్దని ప్రజలకు సూచించారు. పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. గతంలో టీడీపీ నాయకులు దోచుకో దాచుకో పద్ధతిని అవలంభించి రూ.కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. రాయదుర్గంలో కూడా కాలవ శ్రీనివాసులు సహజ సంపదను కొల్లగొట్టి కోట్లు సంపాదించుకున్నాడని దుయ్యబట్టారు. అన్ని కులాలను వంచించి, దిస్ ప్లేస్ ఈజ్ అవైలబుల్ అనే కాగితం ముఖాన కొట్టిన శిలఫలాకాల వీరుడు, మోసగాడు అంటూ ఎద్దేవా చేశారు. పార్టీలకతీతంగా ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల ద్వారా టీడీపీ నాయకులు సైతం లబ్ధి పొందారన్నారు. ఇదే గ్రామంలో టీడీపీకి చెందిన గొల్ల శివారెడ్డి, భార్య కిష్టమ్మ అనే కుటుంబానికి జగనన్న విద్యాదీవెన రూ.7,24,500 తో కలిపి మొత్తం రూ.9,55,094 లబ్ధి చేకూరిందన్నారు.


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఉడేగోళం సహకార సంఘం అధ్యక్షుడు భీమన్న, శివారెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి, ఎర్రగుంట వెంకటరెడ్డి, కణేకల్లు టౌన్ కన్వీనర్ కేశవరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ ధనుంజయ, ఆవులదట్ల ఉప సర్పంచ్ వెంకటేష్ నాయక్, జనార్దన్, నారాయణ నాయక్, ధర్మానాయక్, సచివాలయ కన్వీనర్లు తిప్పేస్వామి నాయక్, హనుమప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రహ్లాద, రామచంద్ర, డీలర్ క్రిష్ణానాయక్ , ఆంజనేయులు, చిక్కణ్ణ, వడ్రహొన్నూరు ఎంపీటీసీ అరుణ్ కుమార్,ఎంపీడీఓ కొండయ్య, ఏఓ మహేంద్ర, డీటీ రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగిరెడ్డిపల్లిలో..

మండలంలోని నాగిరెడ్డిపల్లిలో సోమవారం ఉదయం 6 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నేతృత్వంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ విద్యావతి, ఎంపీడీఓ కొండయ్య తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని వారు కోరారు.


సర్వే రాళ్లను పాతుతున్న ప్రభుత్వ విప్ కాపు

భూ రీసర్వే ద్వారా వందేళ్ల భూ సమస్యలకు చెక్ ..

వందల ఏళ్ల నాటి భూ సమస్యలకు చెక్ పెడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూ రీసర్వేకు శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష పథకం ద్వారా మండలంలోని ఆవులదట్ల, మెచ్చిరి, చదం, కొంతానపల్లి, 74 ఉడేగోళం గ్రామాల్లో చేపట్టిన భూ రీ సర్వే ముగిసింది. ఈ సందర్భంగా ఆవులదట్ల గ్రామంలో భూ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రఘు ఆధ్వర్యంలో లాంగిట్యూడ్, లాట్యిట్యూడ్ ద్వారా గుర్తించిన స్థలంలో ఆదివారం భూమి పూజ చేసి ప్రభుత్వం సరాఫరా చేసిన సర్వే రాళ్లను పాతి, కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

దాన ధర్మాలకు ప్రతీక రంజాన్

ఉరవకొండ: దాన ధర్మాలకు ప్రతీకగా నిలిచే రంజాన్ మాసంలో ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు ఉంటూ ఐదు పూటలా నమాజులు ఆచరించడం ఎంతో గొప్ప విషయమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐదు మసీదుల పరిధిలోని వందలాది మంది ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక హజరత్ బీబీ జైనబ్బీ దర్గా ఆవరణలో విద్యుత్ దీప కాంతుల వెలుగుల్లో ముస్లిం మతపెద్దలు, మసీదుల మూతవల్లిలు, మౌజన్‌ల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. ఉపవాస దీక్ష విరమించే కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం వారు ముస్లింలకు ఇఫ్తార్ విందును వడ్డించారు. వారిని ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, ఉరవకొండ పీఏసీఎస్ చైర్మన్ షేక్షావలి, దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా, మైనార్టీ పట్టణ కన్వీనర్ పామిడి జాకీర్, కోఆప్షన్ సభ్యుడు పామిడిసలీం, నాయకులు వడ్ల సలీం, ఆసీఫ్, మోమిన్ జిలాన్, అయ్యర్‌దాదు, జీఎంఎస్ షాకీర్, జెండా జిలాన్, అన్వర్, జిలాన్, రఫీక్,తాజు, టైలర్ శర్మాస్ తదితరులు పాల్గొన్నారు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం, ప్రణయ్‌రెడ్డి

సజావుగా ప్రవేశ పరీక్ష

కళ్యాణదుర్గం: జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం సజావుగా జరిగింది. పట్టణంలోని స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 187 మంది పరీక్షలకు హాజరు కావల్సిఉండగా 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు వార్డెన్ పద్మావతి తెలిపారు.

ఏకాదశి పూజలు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామికి ఏకాదశి పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున తులసి మాలధారణకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు.

సంక్షిప్త సమాచారం

అపూర్వ సమ్మేళనం


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999-2000లో చదివిన విద్యార్థులు కలిశారు. అప్పటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. నాటి గురువులను సన్మానించారు.

ఉపాధ్యాయ బదిలీలు వెంటనే చేపట్టాలి

ఉరవకొండ: ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు వెంటనే చేపట్టాని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఉరవకొండ ఏపీటీఎఫ్ జోనల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శితో పాటు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు వెంకటేష్, సిరాజుద్దీన్, జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి హనుమప్ప, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామకృష్ణ హాజరయ్యారు. ఏపీటీఎఫ్ జోనల్ బాధ్యుడు సాకే భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. బకాయి డీఏలు వెంటనే ప్రకటించి, అడహక్ ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులకు రావాల్సిన నగదు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల అధ్యక్ష, కార్యదర్శిలు పాల్గొన్నారు.

విట్లంపల్లిలో అగ్ని ప్రమాదం

కళ్యాణదుర్గం: మండలంలోని విట్లంపల్లి సమీపంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆకతాయిలు బీడీ తాగి రోడ్డు పక్కనే పడేయంతో ఎండుగడ్డి మొత్తం అంటుకుంది. పక్కనే పొలంలో టమాట, వేరుశనగ సాగు చేసిన రైతు వెంకటేశులు అప్రమత్తమైన ఫైర్ అధికారులకు సమాచారమిచ్చారు. ఫైర్ ఆఫీసర్ నజీర్ అహ్మద్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

శ్మశాన వాటికలో మంటలు

ఉరవకొండ: స్థానిక వెలిగొండ రోడ్డు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలో ఆదివారం పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో పలు సమాధులు ధ్వంసమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు శ్మశాన వాటికలో ఏపుగా పెరిగిన ముళ్ల కంపలను కొట్టి, మిగిలిన బూడములకు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో పలు సమాధులు ధ్వంసమయ్యాయి. గత రెండు నెలలుగా శ్మశాన వాటికలో కొంతమంది చెట్లు కొట్టుకుని చివరకు నిప్పు పెట్టి వెళుతున్నట్లు పలువురు వాపోయారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన

గుమ్మఘట్ట: మండలవ్యాప్తంగా గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న ఆర్బీకే సిబ్బందికి భూసారపరీక్ష, మట్టినమూనా సేకరణపై అవగాహన కల్పించారు. మండలకేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారి నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు, వీఏఏలు, వీహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.